క్లుప్తంగా

అలరించిన 'సమ్మర్ న్యూట్రిఫెస్ట్'


న్యూట్రిఫెస్ట్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

ఖమ్మం సహకారనగర్: జాతీయ పోషకాహార మాసోత్సవం సందర్భంగా ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాలలో గురువారం జువాలజీ, మైక్రోబయాలజీ, సేఫ్టీక్లబ్-భాగ్యక్లబ్-ఐక్యూఏసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ న్యూట్రీఫెస్ట్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేగవంతమైన జీవితంలో ప్రతి ఒక్కరూ పోషకాహారంలో తృణధాన్యాల ప్రాముఖ్యత పెరిగిందని, ప్రకృతి సిద్ధమైన పప్పు దినుసులు సమతుల్యంగా ఉపయోగించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జువాలజీ విభాగాధిపతి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.సునంద, మైక్రో బయాలజీ విభాగాధిపతి డా.అనితకుమారి, సేఫ్టీ క్లబ్ కన్వీనర్ డాక్టర్ షేక్ గౌస్, భాగ్య హెల్త్ క్లబ్ కన్వీనర్ బి.వెంకటేశ్వర్లు, ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ డాక్టర్ రమా సత్యవతి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.అనురాధ, వైస్ ప్రిన్సిపాల్స్ ఏఎల్ఎన్.శాస్త్రి, డాక్టర్ బానోత్ రెడ్డి, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు ప్రాధాన్యం కల్పించాలి

నేలకొండపల్లి: తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజిని కలిసి కోరారు. ఢిల్లీలో గురువారం కలిసి వివిధ అంశాలను వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజల్లోకి ఇంటింటికి తీసుకెళ్తున్నట్లు వివరించారు. అనంతరం జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్‌భాను షిబ్‌ను కలిసి ఘనంగా సన్మానించారు.

డీఎంహెచ్‌ఓకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంవైద్యవిభాగం: ఆధార్‌తో అటెండెన్స్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేశారు. గురువారం ఐడీఓసీలోని డీఎంహెచ్‌ఓ కళావతిబాయిని తెలంగాణ వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం హెచ్1 ఐఎన్‌టీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వి.కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి ఎన్.సందీప్, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, నిర్మల జ్యోతి, విజయ్‌కుమార్, టీఎన్‌జీఓ మధిర యూనిట్ వైస్ ప్రసిడెంట్ సుబ్బలక్ష్మీ, సభ్యులు పుణ్యవతి, రాజేశ్వరి, డెవిల్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కోర్ట్
వినోద	మ్యాడ్ 2, ఛావా
సాయిరాం	వీర ధీర శూర
ఆదిత్య	రాబిన్‌హుడ్
శ్రీనివాస	ఎల్2: ఎంపురాన్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	4
వంకాయ	28		20
బెండకాయ	28	పాలకూర	4
పచ్చిమిర్చి	20		20
కాకర	38	చుక్కకూర	4
బీర	44		20
దొండ	30	తోటకూర	4
పొట్లకాయ	34		20
చిక్కుడు	84	గోంగూర	3
గోరుచిక్కుడు	48		20
క్యాబేజీ	20	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	28	కొత్తిమీర	1
చామగడ్డ	44		25
క్యారెట్	34	పుదీన	1
క్యాప్సికం	54		20
బీట్‌రూట్	24	-ఖమ్మం వ్యవసాయం	

చెత్తశుద్ధి లేక..

ప్రచారానికే పరిమితమైన సేంద్రియ ఎరువు తయారీ

- కొరవడిన అవగాహన
- అలంకారప్రాయంగా సెగ్రిగేషన్ షెడ్లు


పల్లెగూడెంలో నిరుపయోగంగా ఉన్న షెడ్లు

ఖమ్మంరూరల్: సేకరించిన చెత్తతో సేంద్రీయ ఎరువుల తయారీ పాలేరు నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రచారానికే పరిమితమైంది. ఇంటింటి నుండి సేకరించిన తడి, పొడిచెత్తను డంపింగ్‌యార్డులకు తరలించి ఆ వ్యర్థాలతో సేంద్రీయ ఎరువుల తయారీ కోసం సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అన్ని చోట్ల నిర్మించిన ఈషెడ్లను వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ కేంద్రాలు.

గ్రామాల్లో ఇంటింటికి సేకరించిన చెత్త నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేయాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం కంపోస్టు షెడ్లను నిర్మించింది. చెత్తను వేరు చేసేందుకు కంపార్టుమెంట్లతోపాటు, కంపోస్టు గదులను నిర్మించారు. సేకరించిన చెత్తతో ఎరువులు తయారు చేసి ఆ ఎరువును రైతులకు విక్రయించి, గ్రామపంచాయతీలకు, మున్సిపాలిటీలకు ఆదాయం కల్పించడంతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్యం, స్వచ్ఛత మెరుగుపర్చవచ్చని భావించింది. అందులో భాగంగానే మండలం, ఏదులాపురం మున్సిపాలిటీలో విలీనమైన 31 గ్రామాల్లో కొన్ని చోట్ల మాత్రమే కేంద్రాలు పని చేస్తున్నాయి. అదే విధంగా మిగతా మండలాల్లో కూడా ఈ కార్యక్రమం తూతూమంత్రంగా నడుస్తోంది. దీంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

పట్టించుకోని అధికారులు..

తడి చెత్త, కూరగాయలు, ఆహార వ్యర్థాలు, గడ్డి, పేపర్లు కంపోస్టు గదుల్లో వేరుగా చేసిన అనంతరం పద్ధతి ప్రకారం వాటిని ఎరువులుగా మార్చి విక్రయించాల్సి ఉంది. సేంద్రియ ఎరువుల అమ్మకంతో ఎంతో కొంత ఆదాయం వస్తుంది. అసలే నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న గ్రామపంచాయతీలకు ఈ విధానాన్ని పాటించి ఆదాయాన్ని మెరుగు పర్చుకోకుండా పంచాయతీ అధికారులు, సిబ్బంది, ఏమీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రజలకు చెత్త వేరుచేయడంపై అవగాహన, సిబ్బందితో చెత్తసేకరించడంపై పట్టనట్టు ఉంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

కంపోస్టు ఎరువును అమ్ముతున్నాం..

తడి పొడి చెత్తను వేరు వేరుగా సేకరించేలా సిబ్బందికి అవగాహన కల్పించాం. ఇప్పటికే సిబ్బంది చెత్తను ఆమేరకు సేకరిస్తున్నారు. కంపోస్టు షెడ్లు కూడా చాలా వరకు వినియోగంలోనే ఉన్నాయి. కంపోస్టు ఎరువు ప్రైవేట్‌గా కొనాలంటే కేజీ రూ.50 ఉంటుంది. అదే పంచాయతీల్లో అయితే రూ.9కే కేజీ ధర ఉంటుంది. సేంద్రియ ఎరువుల తయారీతో గ్రామపంచాయతీలకు మరింత ఆదాయం చేకూర్చేందుకు చర్యలు చేపట్టాం.

– కుమార్, ఎంపీడీఓ, ఖమ్మంరూరల్

ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలి


ఖమ్మంమయూరిసెంటర్: ధర్నా చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పెండింగ్‌లో ఉన్న ఆసరా పెన్షన్ తక్షణమే మంజూరు చేయాలని, బోదకాలు బాధితులను దివ్యాంగులుగా గుర్తించాలని, ఎన్నికల సమయంలో పెన్షన్లు పెంచుతానాన్ని ప్రభుత్వ హామీని నిలబెట్టుకోవాలంటే డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ పిలుపులో భాగంగా కేఎంసీ ఎదుట ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, ఆవుల అశోక్ మాట్లాడారు. పెంచి ఇస్తామన్న పెన్షన్ కూడా ఇంతవరకు అమలు చేయలేదని, జిల్లాలో పెన్షన్ల కోసం అర్హతలున్న 16 వేల మంది ఎదురు చూస్తున్నారన్నారు. మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, నాయకుడు సిహెచ్ శిరోమణి, శోభ, శ్రీనివాస్, బల్లెపల్లి వెంకటేశ్వర్లు, సత్తార్, లెనిన్, వెంకటేష్, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, చందు, రామారావు, జాస్మిన్, రమేష్, భద్రయ్య పాల్గొన్నారు.

కామేపల్లి: పెండింగ్‌లో ఉన్న పింఛన్లు, రేషన్‌కార్డులు తక్షణమే మంజూరు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కారేపల్లి, కామేపల్లి సంయుక్త మండల కార్యదర్శులు ఎన్వీ.రాకేశ్, గుమ్మడి సందీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. చల్లా రాజు, పులకాని సత్తిరెడ్డి, వేములపల్లి వీరన్న, కొయ్యల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం: పెంచన్లు అందించాలని మాస్‌లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఆవుల మంగతాయి, పార్టీ మండల కార్యదర్శి కేలోత్ లక్ష్మణ్, కురాకుల నరసయ్య, లక్ష్మణ్, బాలిన నరసింహారావు ఉన్నారు.

తిరుమలాయపాలెం: సీపీఐఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ సిలార్‌సాహెబ్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, తిమ్మిడి హన్మంతరావు మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు వెంకట్ రెడ్డి, ఆరెంపుల వెంకన్న, బానోతు శంకర్, గోకినపల్లి సరోజన, కొత్తపల్లి లక్ష్మి, నామ అప్పారావు, మీగడ సత్యం, నరసయ్య, సీతారాములు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్వే రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలి

రఘునాథపాలెం: గతేడాది నవంబర్‌లో నిర్వహించిన సమగ్ర కులగణన సర్వేలో పనిచేసిన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు రెమ్యునరేషన్ ప్రకటించి ఇంతవరకు చెల్లించలేదని, తక్షణం చెల్లించాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శి కేశవరావు, తుమాటి సైదబాబులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జరిగిన మండల సమావేశంలో వారు మాట్లాడుతూ... సర్వే పూర్తి చేసి 4 నెలలు ముగిసినా ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రకటించిన రెమ్యునరేషన్ అందించలేకపోవడం విచారకరమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా ఐదు డీఏలను పెండింగ్‌లో పెట్టడం సమంజసం కాదన్నారు. గతేడాది పదో తరగతి జవాబు పత్రాలు మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయుల పారితోషకం ఇప్పటివరకు చెల్లించలేదని, బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సోమ్లా నాయక్, లింగం సతీష్, రాష్ట్ర బాధ్యులు ఎండి జబ్బార్, రంగారావు, ఉపాధ్యక్షులు తిరుపతిరావు, చందన, సురేష్, చారి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంఘం నాయకులు

మోటార్ తొలగింపు


మోటార్‌ను తొలగిస్తున్న సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: నగర ప్రజల తాగునీటి అవసరాలకు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో చేతి పంపులను ఏర్పాటు చేశారు. ఈ మేరకు నగరంలోని త్రీటౌన్ ప్రాంతం ట్రంక్‌రోడ్డులో రెండేళ్ల క్రితం ఓ అపార్ట్‌మెంట్ వాసులు చేతిపంపును తొలగించి, బోరులో అక్రమంగా మోటార్ ఏర్పాటు చేసి తమ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. అధికారులకు అందిన ఫిర్యాదులతో అపార్ట్‌మెంట్ ముందు ఉన్న మోటార్‌ను గురువారం తొలగించారు. వేసవిలో స్థానిక ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూసేందుకు చేతిపంపును మరలా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా మోటార్‌ను తొలగించే సమయంలో అపార్ట్‌మెంట్ వాసులు అక్కడకు చేరుకొని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అధికారి, సిబ్బందిపై వారు దురుసుగా ప్రవర్తించినట్లు తెలిసింది. దీంతో ఏఈఈ అపార్ట్‌మెంట్ వాసులపై త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమపై పరుష పదజాలంతో, దుందుడుకు చర్యలతో వ్యవహరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ..


ఖమ్మం మామిళ్లగూడెం: తోఫా పంపిణీ చేస్తున్న నున్నా నాగేశ్వరరావు


నేలకొండపల్లిలో..

ఖమ్మం మామిళ్లగూడెం: దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో లౌకికవాదం ప్రమాదంలో పడిందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నగర ప్రముఖ డాక్టర్ షేక్ రెహనా బేగం ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం ఖమ్మం వన్‌టౌన్ పరిధిలోని 23వ డివిజన్‌లో పెద్దఎత్తున తోఫాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, డివిజన్ సెక్రటరీ వై.విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు జబ్బర్, మీరా సాహిబ్, వన్‌టౌన్ కార్యదర్శి నాగుల్‌మీరా, తంగిరాల శ్రీకాంత్, హరీష్, బేగం, అజితా, రవి, నాగేశ్వరరావు, సుధాకర్, జగన్ మోహన్‌రావు, సత్తార్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: రంజాన్ మాసం మత సామరస్యానికి ప్రతీక అని పలువురు అన్నారు. మండల కేంద్రానికి చెందిన వెలగపూడి వెంకటరత్నం ముస్లింలకు తోఫా కిట్లను పంపిణీ చేశారు. ముస్లిం పెద్దలు జమాల్‌సాహెబ్, ఎండి.వాజీద్, అబ్దుల్ నబీ, ఖాసిం సాహెబ్, సైదా, జాన్ మహ్మద్, బాబా మస్తాన్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫయర్ వితరణ


ప్యూరిఫయర్ అందజేస్తున్న ప్రతినిధులు

తిరుమలాయపాలెం: విద్యార్థులకు శుభ్రమైన తాగునీరు అందించడానికి విర్‌బాక్ పశువుల మందుల కంపెనీ వారు తిరుమలాయపాలెం ఉన్నత పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్‌ను గురువారం వితరణగా అందజేశారు. ఈ మేరకు ప్యూరిఫయర్‌ను హెచ్‌ఎం విజయకుమారి, విర్‌బాక్ నిమల్ మెడిసిన్ కంపెనీ ఏరియా మేనేజర్ రాజు పూజారి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ జిల్లా మేనేజర్ హరీశ్, ఉపాధ్యాయులు ధనమూర్తి నరేందర్, ఏవీ.నాగేశ్వరరావు, విజయలక్ష్మి, బాల చంద్ర ప్రసాద్, హమీద్, గోపమ్మ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ఖమ్మంరూరల్: ఎర్రజెండా నిర్వహించే పోరాటాలతోనే పేదలకు న్యాయం జరుగుతుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే ఏకైక మార్గమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య అన్నారు. మండలంలోని ఎం.వెంకటాయపాలెంలో జరిగిన మాస్‌లైన్ నాయకులు సంగయ్య సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కుర్రా వెంకన్న, దొండేటి సత్యం, యమున, స్వామి, లక్ష్మయ్య, రామయ్య ఉన్నారు.

తాత్కాలిక కమిటీ ఏర్పాటు


మాట్లాడుతున్న కిషోర్

ఖమ్మంఅర్బన్: నగరంలోని 3వ డివిజన్ బాలపేటలో గురువారం జరిగిన బాలపేట నూనె గింజల ఉత్పత్తిదారుల సర్వసభ్య సమావేశంలో తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ లిక్విడేటర్ కె.కిషోర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తాత్కాలిక కన్వీనర్‌గా కుర్రా మోహన్‌రావు, సభ్యులుగా సైదా, సీతారామారావు, విక్రమాచారి, నరిసింహరావు, సత్యం, తదితరులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ తవ్వకాలను నిలిపివేయాలి

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాదారంలో దళితులకు చెందిన భూములలో క్వారీ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ మేరకు గ్రామంలో దళితులకు చెందిన భూములను గురువారం సందర్శించి బాధితులను కలిసి వివరాలు సేకరించారు. అనంతరం తహసీల్దార్‌తో చర్చించారు. వెంటనే క్వారీ పనులు ఆపాలని కోరారు. వెంటనే ఆపకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సరిత

ఖమ్మంరూరల్: పంటలకు వారబంది పద్ధతిలో సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ఏడీఏ సరిత అన్నారు. మండలంలోని వెంకటగిరిలో ఐబీ అధికారులతో కలిసి ఆమె వారబందీ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఏరియాలో మొక్కజొన్న, వరిపంట సాగులో ఉన్నందున పంట చివరి కాలం వరకు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని పేర్కొన్నారు. సాగునీటిని వృథా చేయొద్దని, అవసరానికి మించి నీటిని పంటలకు ఇవ్వొద్దని, అలా చేయడం వల్ల నష్టమే తప్ప లాభం ఉండదన్నారు. వరి, మొక్కజొన్న పంటలకు వచ్చే చీడపీడలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంటలకు మోతాదుకు మించి ఎరువులు వేయొద్దని, అధిక మోతాదులో వేయడం వల్ల భూమి చవుడుగా మారడంతో పాటు పంటలకు చీడపీడలు సోకుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఉమానగేష్, ఐబీ ఏఈ సీతారాంప్రసాద్, ఏఈఓ ఆదర్శ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలుచేయాలి


మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం గిరిప్రసాద్‌భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. రాష్ట్రంలో ఇంకా విద్యా సంవత్సరం పూర్తి కాకుండానే ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లలో ఇంటర్మీడియట్ కళాశాలలు 2025 -2026 విద్యా సంవత్సరానికి ముందస్తు అడ్మిషన్ నిర్వహిస్తున్న అధికారులు మాత్రం ముద్దు నిద్ర వీడటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలు అప్పుడే అడ్మిషన్ పూర్తయినట్టు చెప్పడం బాధాకరమన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ కళాశాల పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్ చేస్తే ఫీజులో రాయితీ కల్పిస్తామంటూ విద్యార్థులు తల్లిదండ్రులను మాయమాటలతో బురుడి కొట్టిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మనోజ్, గోపి, ప్రతాప్, గణేష్, రవి, రాకేష్, ఉమామహేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వమే న్యాయం చేయాలని బాధితుల సంఘం నాయకులు యర్రాబాబు, తాటి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల కమిటీ సమావేశం గురువారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుడిమెట్ల రజిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో తాటి వెంకటేశ్వర్లు, యర్రాబాబు మాట్లాడుతూ... బాధితులు ఆందోళన చేయడంతో కంపెనీకి సంబంధించిన బాధ్యులను అరెస్టు చేసి ప్రభుత్వాలు చేతులు దులుపుకున్నాయన్నారు. గతంలో సీఎంను కలిసినప్పుడు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని దానిని నిలబెట్టుకోవాలన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గోగుల వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులు మేకల శ్రీనివాసరావు, రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు సునీత, వీరబ్రహ్మచారి, పాషా, లక్ష్మి నారాయణ, సతీష్, రాజు, కృష్ణయ్య, లక్ష్మి, అనసూర్య, రమాదేవి, సురేష్, మురళి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

ఖమ్మంరూరల్: పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. మండలంలోని పెదతండా, నాయుడుపేట, జలగంనగర్, సీపీఐ గ్రామశాఖ సమావేశాలు గురువారం జరిగాయి. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ఏహామీని నిలబెట్టుకునే స్థితిలో ప్రభుత్వాలు లేవన్నారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఎండీ.మౌలానా, నాయకులు శ్రీను, భూక్యా దేవా, శ్రీనివాస్, కిరణ్, రవి, పుల్లయ్య నాయకులు పాల్గొన్నారు.

మొరం తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

ఖమ్మంరూరల్: మండంలోని తెల్దారుపల్లి బోడగుట్ట వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా, అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్, మొరాన్ని గురువారం పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఏదులాపురంకు చెందిన గణపారపు చంద్రశేఖర్, మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం చిలుక్కోయలపాడుకు చెందిన ఊడుగు శ్రీను ఇద్దరూ కలిసి ప్రొక్లైయినర్‌తో మొరాన్ని టిప్పర్‌లో తరలిస్తూ అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు బోడగుట్ట వద్దకు వెళ్లి టిప్పర్‌ను, ప్రొక్లైయినర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఒక్కో టిప్పర్‌కు రూ.5 వేలు చొప్పున అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

మొక్కల సంరక్షణపై నిర్లక్ష్యం వద్దు


నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నేలకొండపల్లి: పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహించే నర్సరీలో మొక్కల సంరక్షణపై నిర్లక్ష్యం తగదని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలంలోని రాజేశ్వరపురంలోని పంచాయతీ నర్సరీని పరిశీలించారు. మొక్కల పెరుగుదల గురించి అడిగి తెలుసుకున్నారు. మొక్కలకు ఎండ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లీకులు కాకుండా నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు ప్రతీ పంచాయతీలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ఉపాధి కూలీల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు.

రేపు దుకాణ సముదాయాల అద్దెకు వేలం

మండల ప్రజాపరిషత్ ఆధీనంలో ఉన్న వీడీఓ క్వార్టర్స్, లక్ష్మి మహిళా మండలి కాంప్లెక్స్‌లను అద్దెకు ఇచ్చేందుకు శనివారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యం.యర్రయ్య అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ... ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నామని, పాల్గొనదలచిన వారు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలి

ఖమ్మం మామిళ్లగూడెం: త్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని తెలంగాణ మాదిగల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజు , తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు గురువారం ఖమ్మంలో జరిగిన రాష్ట్ర కమిటీ ముఖ్యుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మాదిగ ఉప కులాలకు రాష్ట్ర కార్పొరేషన్లు తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో అధికార ప్రతినిధి మేళ్లచెరువు కృష్ణరావు, ఉపాధ్యక్షుడు కాంపెల్లి సతీష్, రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య, సిటీ అధ్యక్షులు కొమ్ము కృష్ణ, రాష్ట్ర మహిళ కన్వీనర్ దండు మేరీ, యువసేన రాష్ట్ర కన్వీనర్ అయినోలి బాలకృష్ణ, కాంపల్లి భగత్, జన్ను తేజ, సమ్మయ్య, సాగర్, మధు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



మురుగు తొలగించేదెవరు..?





డ్రెయినేజీల్లో మురుగు తొలగించేవారు లేకపోవడంతో మురుగునీరు ప్లారి రోడ్లపైకి చేరుతోంది. నగరంలోని నిజాంపేట ప్రాంతంలో డ్రెయినేజీల్లో వ్యర్థాలు, ప్లాస్టిక్ సంచులు పేరుకుపోయి మురుగు పొర్లుతోంది. పారిశుధ్య సిబ్బంది, అధికారులు పట్టించుకోవడం లేదని, ఫిర్యాదులు చేస్తే పెడచెవిన పెడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. - ఖమ్మంమయూరిసెంటర్

ప్రశ్నించాల్సిన అధికారి : ఎం.సాంబయ్య, శానిటరీ సూపర్‌వైజర్, కేఎంసీ
సెల్ నంబర్ : 9494650386